# మిస్టర్ కంప్యూటర్

మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఇండియన్ ఆర్మీలోని అనేక విభాగాల్లో ఆధునిక కంప్యూటర్స్ ఏర్పాటు చేస్తున్నారన్న విషయం ఆ రోజు సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని ఆఫీసర్స్ మెస్‌లో హాట్ టాపిక్ అయింది. అంతా దాని మీద మాట్లాడుకోసాగారు.

"కంప్యూటర్స్ వస్తే ఇక స్టాఫ్ తగ్గుతారు" చెప్పాడు మేజర్ చంద్రకాంత్.

"కావచ్చు. ఎడ్మినిస్ట్రేషన్‌లో తగ్గచ్చు కానీ ఫ్రంట్‌లో స్టాఫ్ తగ్గరు. కంప్యూటర్‌లు మనలా వెళ్లి శత్రువులతో యుద్ధం చేయలేవు కదా?" కెప్టెన్ రత్తయ్య చెప్పాడు చిన్నగా నవ్వి.

"ముందుగా ఎడ్మినిస్ట్రేషన్, స్టోర్స్, సప్లైలలోట. తర్వాత పర్సనల్ విభాగంలోట." చెప్పాడు లెఫ్టినెంట్ లింగయ్య.

"కంప్యూటర్స్ మనుషుల్లా ఆలోచించి పని చెయ్యలేవు. దానికి ఫీడింగ్ తప్పయితే ఆ తప్పుని సరిదిద్దుకోలేవు." తన అభిప్రాయం చెప్పాడు కల్నల్ ఏకలింగం.

* * *

ఏకలింగం ఇండియన్ ఆర్మీలోంచి రిటైర్ అవడానికి ఏడు నెలల తొమ్మిది రోజుల ముందే అన్ని రాంక్‌లవారి సర్వీస్ రికార్డ్‌లు కంప్యూటర్‌లో ఫీడ్ చేశారు. ఎవరు ఏ తేదీన ఆర్మీలో చేరింది, ఏ తేదీన ఏ రాంక్‌కి ప్రమోషన్ వచ్చిందీ, ఏ విషయంలో ఏ శిక్ష విధించిందీ, ఎవరి ఆస్తు లెంతెంత, ఎవరెన్ని రోజులు యుద్ధాల్లో పాల్గొన్నారు, లభించిన పతకాల వివరాలు ... ఒకటేమిటి? ఏ టు జడ్ సమాచారం అందరి సర్వీస్ రికార్డ్స్‌లో కంప్యూటర్‌లోకి ఫీడ్ చేశారు.

ఏకలింగం రిటైరవడానికి మూడు నెలల మునుపు ఆ తేదీని తెలియచేస్తూ కంప్యూటర్ నించి ఆటోమేటిక్‌గా ఓ ఉత్తరం వచ్చింది. దానికి అతని మొత్తం సర్వీస్ రికార్డ్ జత చేసిన స్టేట్‌మెంట్ ఉంది. తప్పులేమైనా ఉంటే కంప్యూటర్ విభాగానికి తెలియచేయమని, అలా తెలియచేయని పక్షంలో అంతా సరిగ్గా ఉందని భావించడం జరుగుతుందని పేర్కొని ఉంది ఆ లెటర్‌లో.

దాన్ని ఒకటికి రెండు సార్లు చదివాడు. కంప్యూటర్ చేసిన తప్పు గ్రహించాక కల్నల్ ఏకలింగం మొహం చిరునవ్వుతో వికసించింది.

"ఏమిటి?" అడిగారు మిత్రులు.

జరిగిన పొరపాటు వివరించాడు. ఆయనకి ఆర్మీలో కల్నల్‌గా ఆఖరి ప్రమోషన్ ఇచ్చిన తేదీ, నెల కరెక్టే కాని సంవత్సరంలోనే తేడా చూపిస్తోం



దా లెటర్.

1956 బదులు 956గా ఉంది సంవత్సరం.

"వెంటనే పర్సనల్ డిపార్ట్‌మెంట్‌కి లెటర్ రాసి జరిగిన పొరపాటుని సరిదిద్దమని కోరండి." ఫ్రెండ్స్ సలహా ఇచ్చారు.

కొద్ది క్షణాలు తన బుగ్గ మీసాన్ని ఆలోచనగా దువ్వుకున్నాడు కల్నల్ ఏకలింగం.

ఆయన మొహంలో మళ్లీ చిరునవ్వు దర్శనం ఇచ్చింది. వాళ్ల సలహాని నిరాకరిస్తున్నట్లుగా తల అడ్డంగా ఊపాడు.

"అదేం? పెన్షన్, పి.ఎఫ్. పేమెంట్స్‌లో తర్వాత ప్రాబ్లమ్ రావచ్చుగా?" అడిగారు మిత్రులు.

"నేను గత వెయ్యేళ్లకి పైగా కల్నల్‌గా ఉన్నప్పుడు కాదని ఎందుకు నిరాకరించాలి? నాకు శాలరి ఎరియర్స్ ఎంత రావచ్చంటారు?" అడిగాడు ఏకలింగం ఆలోచనగా.

"శాలరి ఎరియర్సా? అస లా పాయింటే మాకు తట్టలేదు." ఉలిక్కిపడి చెప్పారు మిత్రులు.

"కంప్యూటర్ నా పాత జీతాన్ని పంపిస్తుంది. కోటీశ్వరుడ్ని అవుతాను." కంప్యూటర్ విభాగానికి ఆ తప్పు గురించి రాయనేలేదు కల్నల్ ఏకలింగం.

మిత్రులు పార్టీ కావాలని డిమాండ్ చేస్తే ఆఫీసర్స్ మెస్‌లో అందరికీ ప్రైడ్ ఆఫ్ ఇండియా అయిన పీటర్ స్కాచ్‌ని పీకల దాకా పోయించాడు.

"మిస్టర్ కంప్యూటర్‌గారికి బుద్ధి, బుర్ర లేదు. పప్పులో కాలేశారు. ఇంకెక్కడికి పోతాడు?" కంప్యూటర్‌ని ఎద్దేవా చేశాడు కల్నల్ ఏకలింగం ఆ పార్టీలో.


రోజులు గడిచాయి.

కల్నల్ ఏకలింగం ఆర్మీ నించి రిటైర్ అయ్యాడు. పర్సనల్ డిపార్ట్‌మెంట్ నించి ఇక పి.ఎఫ్., శాలరి ఎరియర్స్ చెక్ రావాల్సి ఉంది. ఆ చెక్ కోసం ఆత్రంగా ఎదురు చూడసాగాడు.

వారం, నెల..., రెండు నెలలు... చివరికి ఆ కవర్ రిజిస్టర్డ్ పోస్ట్‌లో వచ్చింది. 'ఆన్ ఇండియా గవర్నమెంట్ సర్వీస్' అన్న అక్షరాలు, సర్వీస్ స్టాంప్ గల కవర్‌ని వణికే చేతులతో చింపాడు. 'ఎన్ని కోట్ల రూపాయలకి చెక్ వచ్చి ఉంటుంది?' అనుకుంటూ.

లోపల ఇంకో కవరుంది. దాని మీద 'కాన్ఫిడెన్షియల్' అని రాసి ఉంది. దాన్నీ చింపి అందులోంచి ఓ లెటర్‌ని తీసి మడతలు విప్పాడు. కింద సంతకం చూశాడు. మేజర్ జనరల్ (కంప్యూటర్స్) భండారి సంతకం ఉంది. చెక్ మాత్రం ఆయన ఊహించినట్లుగా ఆ లెటర్‌కి స్టేపిల్ చేసి లేదు. ఆ లెటర్‌ని జాగ్రత్తగా చదివాడు.

"టు




కల్నల్ ఏకలింగం,

సైనిక్‌పురి, హైదరాబాద్,

సర్,

మా కంప్యూటర్ రాసిన లెటర్‌ని మీ సమాచారం కోసం జత చేస్తున్నాను.

(సంతకం)

మేజర్ జనరల్ (సి)"

ఆ లెటర్‌కి స్టేపిల్ చేసి ఉన్న కంప్యూటర్ ప్రింట్ అవుట్‌ని చదివాడు కల్నల్ ఏకలింగం.

"రిటైరైన కల్నల్ ఏకలింగం సెటిల్‌మెంట్‌ని వెరిఫై చేసినప్పుడు అతనికి గత వెయ్యేళ్లుగా జీతం ఇవ్వలేదని, అది బాకీ అని తేలింది. అయితే బాకీ పడ్డ జీతం లెక్క కట్టేందుకు అవసరమైన సమాచారం, అంటే క్రీ.శ. 956లో బేసిక్ ఎంత, డి.ఏ. ఎంతలాంటి సమచారం లేదు కాబట్టి ఇండియన్ ఆర్మీ నలభైకోట్ల అరవై ఎనిమిది లక్షల ఏభై నాలుగు వేల పన్నెండు రూపాయల ఏభై మూడు నయాపైసలు చెల్లించి ఈ క్లెయిమ్‌ని సెటిల్ చేయడం సబబని భావిస్తోంది."

ఏకలింగం మొహం వెంటనే ఆనందంతో వికసించింది. తను కోటీశ్వరు డయ్యాడు! పేజీ తిప్పి లెటర్‌లోని తర్వాతి భాగం చదివాడు.

"అలాగే ఈ సెటిల్‌మెంట్‌ని వెరిఫై చేసినప్పుడు, క్రీ.శ. 1738లో ప్లాసీ యుద్ధ సమయంలో పదహారువందల అశ్వాలు, ఎనిమిదివందల పదిహేడు రథాలు, పదిలక్షల ఎనభైవేల ధనుస్సులు, అంతకు ఇరవై రెట్లు బాణాలు, ఇంకా శూలాలు, బరిసెలు లాంటి అనేక ఆయుధాలు ఇండియన్ ఆర్మీ ఆయుధశాల నించి మాయం అయ్యాయని, అప్పుడు ఆ ఆయుధశాలకి ఏకైక ఇన్‌ఛార్జిగా ఉన్న కల్నల్ ఏకలింగం ఆ నష్టానికి బాధ్యుడని, ఆ విషయంలో అతనికిచ్చిన మెమోకి ఇంతదాకా సమాధానం ఇవ్వలేదన్న సంగతి కూడా బయట పడింది.

జాడ తెలీకుండా పోయిన ఆ వస్తువుల విలువ నలభైకోట్ల అరవై ఎనిమిది అక్షల ఏభై నాలుగు వేల పదహారు రూపాయల అరవై నాలుగు పైసలు. కాబట్టి ఏకలింగానికి రావాల్సిన బెనిఫిట్స్ నించి తేడా అయిన ఈ నాలుగు రూపాయల పదకొండు పైసలు రికవరి చేయడం జరుగుతోంది. ఇంతటితో ఈ విషయం క్లోజ్ అయిందని ఏకలింగానికి ఇందుమూలంగా తెలియజేయడం జరిగింది.

మిగిలిన మొత్తానికి చెక్ మరో వారంలో పంపబడుతుంది."

ఏకలింగం మొహంలోని చిరునవ్వు ఠక్కున మాయమైంది.

●

